క్లుప్తంగా

ఒకరిపై పోక్సో కేసు

మహబూబాబాద్ రూరల్ : మండలానికి చెందిన బాలికను వేధింపులకు గురి చేసిన ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ గురువారం తెలిపారు. వ్యక్తి వేధింపులపై బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

ముగ్గురిపై...

నర్సింహులపేట : మండలంలోని లోక్యాతండా శివారులోని బంగారుతండాకు చెందిన భూక్య వినోద్, కైక, నర్సింహలపై కేసు నమోదు చేసినట్లు సీఐ మంగీలాల్ తెలిపారు. తనతో వినోద్‌కుమార్ నిశ్చితార్థం చేసుకుని పెళ్లికి నిరాకరించడం, అదనపు కట్నం కావాలనడంతో పెద్దనాగారం శివారు జగ్యాతండాకు చెందిన నీరజ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వినోద్‌పై రేప్, కైక, నర్సింహలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పోలీసులకు ఫిర్యాదు



మరిపెడ రూరల్ : మండలంలోని ఆముదాలపల్లి తండాకు చెందిన మాలోతు ధన్‌సింగ్ (తావుర్య) అనే వ్యక్తి తానంచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 75 నుంచి 111ల్లో తమకున్న సుమారు 15 ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపిస్తూ అదే తండాకు చెందిన ధారావత్ మోతీరాం, బాలాజీ, బుజ్జి, మాలోతు సింగన్న, లక్పతి, దరియా, బాదావత్ చిలకమ్మ, లాల్య, కిషన్, హన్మ, భూక్య రాము, భూక్య జ్యోతి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ధన్‌సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు ఎన్నికలు

డోర్నకల్ : మండల కేంద్రంలోని నిర్మలా హైస్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ పీపుల్ లీడర్, అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్ పదవుల కోసం సాధారణ ఎన్నికల తరహాలో గురువారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు క్యూలో నిల్చుని బ్యాలెట్ ద్వారా ఓటేశారు.

కక్షసాధింపు చర్యలు తగదు



డోర్నకల్ : మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు యాదవులపై కక్ష సాధింపు చర్యలు తగదని భారత యాదవ సమితి జిల్లా కన్వీనర్ ఎల్లావుల హరికృష్ణ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుడి విగ్రహ ఏర్పాటుకు అభ్యంతరం తెలిపినందుకు యాదవ సంఘం నాయకులైన మేకల మల్లిబాబు, మచ్చా శ్రీనివాస్ తదితరులపై మంత్రి అజయ్‌కుమార్ ప్రోద్బలంతో కేసులు పెడుతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు జక్కుల వెంకటేశ్వర్లు, వీరబోయిన ఉపేందర్, దాసరి శ్రీనివాస్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

నెహ్రూసెంటర్ : మైనార్టీ గురుకుల పాఠశాలను కురవి మండలంలోనే కొనసాగిస్తూ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కురవి మండలంలో కొనసాగిన మైనార్టీ పాఠశాలను ప్రస్తుత విద్యా సంవత్సరంలో డోర్నకల్‌లోని సరైన వసతులు లేని ఓ ప్రైవేటు పాఠశాలకు తరలించారని చెప్పారు. విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఎస్సైకి సన్మానం



గంగారం : గంగారం ఎస్సైగా దిలీప్‌ను విధుల్లో చేరిన క్రమంలో గంగారం, కొత్తగూడ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు, వజ్జ సారయ్య, ఉద్యోగుల సంఘం నాయకులు సువర్ణపాక జగ్గారావు, తుర్సు భూమయ్య, నాయకులు అక్కపెల్లి సాంబయ్య గురువారం శాలువా కప్పి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు.

'మధ్యాహ్న' కార్మికుల నిరసన



కేసముద్రం : మండలంలోని కల్వల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లలిత, జ్యోతి, భాగ్య, శోభ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



మరిపెడ : రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీతో శవయాత్ర నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



మరిపెడ రూరల్ : తానంచర్ల సబ్ స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న శ్రేణులు

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ సరఫరాపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ఎదుట గురువారం నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



తొర్రూరులో..



పెద్దవంగరలో..



కేసముద్రంలో..



దోర్నకల్‌లో..



గార్లలో..

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



మహబూబాబాద్ టౌన్ : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



కురవి : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మహబూబాబాద్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీఎస్జీఓఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్లను జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర ఈనెల 20న జిల్లాకు చేరుకుంటుందని చెప్పారు. ఈనెల 21న తలపెట్టిన 'వాక్ ఫర్ ఓపీఎస్' మార్నింగ్ వాక్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంత్, రవి, శ్రీకాంత్, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరించే పార్టీలకే మద్దతు

మహబూబాబాద్ అర్బన్ : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి (ఓపీఎస్)ను పునరుద్ధరించే పార్టీలకే ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల మద్దతు ఉంటుందని జాయింట్ ఫోరమ్ ఫర్ రీస్టోరేషన్ ఆఫ్ ఓపీఎస్ నాయకులు షేక్ యాకూబ్, చుంచు శ్రీశైలం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సీపీఎస్ రద్దు కోసం జాయింట్ ఫోరమ్, ఓపీఎస్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో తలపెట్టిన సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బలాస్టి రమేశ్, సోమ విష్ణువర్ధన్, గొడిశాల సంజీవ, రాచకొండ ఉపేందర్, కె శ్రీనివాస్, ఎస్.విద్యాసాగర్, ఎం.ప్రవీణ్‌కుమార్, కే.ప్రసాద్, అవునూరి రవి, బాలు నాయక్, రఫీ, గునిగంటి శ్రీను, బి.ప్రకాశ్, లక్ష్మయ్య, వెంకట్, శ్రీనివాస్, కోడెం శ్రీనివాస్, కె.వసంత, సునిత పాల్గొన్నారు.

కురవి : తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ)ఆధ్వర్యంలో మండలంలోని మొగిలిచర్లలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతుల మీదుగా పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘం డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు ఆకుతోట శివప్రసాద్ మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, రాజశేఖర్, రమాదేవి, లలిత, ఎంపీటీసీ చల్లగుండ్ల గణేష్, మాజీ ఎంపీపీ గుడిబోయిన రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి

కేసముద్రం : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రజలను కోరారు. మండలంలోని తాళ్లపూసపల్లిలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో రూ.21.89 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్, డిజిటల్ క్లాస్ రూమ్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం 28 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. తదనంతరం ఇనుగుర్తి మండల కేంద్రంలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుహాసిని, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రంగారావు, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

మహబూబాబాద్, గార్ల, కేసముద్రం, బయ్యారం, కురవి, గూడూరు మండలాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంద అప్పిరెడ్డి సందర్శించి మాట్లాడారు. గార్లలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివ, కేసముద్రంలో బీజేపీ అనుబంధ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ సంఘీభావం తెలిపి మాట్లాడారు.



మహబూబాబాద్ : సమ్మెలో కార్మికులు, నాయకులు



బయ్యారం : కళ్లకు గంతలతో..



గూడూరులో..



కురవిలో..

బురద రోడ్డుపై వరినాట్లతో నిరసన



రోడ్డుపై నాటువేస్తూ నిరసన తెలుపుతున్న స్థానికులు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని అయోధ్యపురం గ్రామ పంచాయతీ పరిధిలోని భజనతండాలోని బురదరోడ్డుపై ప్రజలు గురువారం వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జినుక రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి సురుగు రంగన్న, సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ నిరసనకారులకు మద్దతిచ్చి మాట్లాడారు. తండలో రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తండాలను పంచాయతీలు చేశామని ఊదరగొడుతూనే ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని విమర్శించారు. తండాలో మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. అత్యవసర సమయంలో 108, అంబులెన్స్, బడి పిల్లలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు వేసి తండావాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు వీరేందర్, రమేశ్, చిరంజీవి, హోంజీ, మురళీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

డోర్నకల్ : మండల కేంద్రంలోని సుభాష్ స్ట్రీట్‌కు చెందిన జి.వీరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ నుంచి మంజూరైన రూ.2.22 లక్షల బీమా చెక్కును స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వాంకుడోత్ వీరన్న గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జి.వీరయ్య బీమా చేయించుకున్న క్రమంలో అతడి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరిందని చెప్పారు. బీమా చేయించుకుంటే కుటుంబాలకు భరోసా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి బిందు, శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పి.సురేశ్, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. మళ్లీ గెలుస్తా

కురవి: 'అభివృద్ధి చేశా.. మళ్లీ గెలుస్తా' అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. గురువారం మండలంలోని జగ్యాతండా జీపీ, మొగిలిచర్ల, కంచర్లగూడెం, నారాయణపురం గ్రామాల్లో రెడ్యానాయక్ పర్యటన భారీ పోలీసు బందోబస్తు నడుమ సాగింది. జగ్యాతండాలో జరిగిన సభలో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ.. తన పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే, ఓర్వలేని కొందరు గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూలి, అల్లూరి విజయ, బుజ్జి, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, ఎంపీటీసీ చల్లగుండ్ల గణేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు సరస్వతి, రఫీ, మహేష్, బాదావత్ రామునాయక్, శంకర్, గుడిబోయిన రాంచంద్రయ్య, భద్రు, అల్లూరి వాసురాజు, బజ్జూరి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

వ్యవసాయ రంగంపై ప్రధాని వివక్ష

నెహ్రూసెంటర్ : ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయ రంగం పట్ల వివక్ష చూపారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌నాయక్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న అధ్యక్షతన గురువారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో శోభన్ మాట్లాడారు. గడచిన తొమ్మిదేండ్లలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. వ్యవసాయ రంగంలోని పరిశోధనలకు ప్రధాని కేవలం 2.88 శాతం కేటాయించారని చెప్పారు. అమెరిక, చైనా, తదితర దేశాలు 7 శాతం కేటాయిస్తూ వ్యవసాయ ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుతున్నాయని తెలిపారు. పీఎం ప్రణామ్ పథకం పేరుతో సేంద్రియ వ్యవసాయం వైపు ప్రచారం చేస్తూ సబ్సిడీకి కోత పెడుతున్నారని మండిపడ్డారు. శెట్టి వెంకన్న, పాపారావు, మధు, సుధాకర్, బుజ్జి, కోటయ్య, తిరుపతిరావు, వెంకట్రాంనర్సయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న శోభన్‌నాయక్

సంక్షిప్త సమాచారం

ఎస్సైకి అంబేడ్కర్ చిత్రపటం బహూకరణ

కురవి : సీరోలు ఎస్సై రమాదేవికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాన్ని బీఎస్పీ నాయకులు గురువారం బహూకరించారు. తొలుత నాయకులు ఎస్సైని కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. ప్రజలకు చట్టబద్ధంగా సేవలు అందించాలని బీఎస్పీ నాయకులు తగరం నాగన్న, తగరం శ్రీరామ్, ఆరెంపల ఉదయ్‌కిరణ్, సుధాకర్, ప్రసాద్ కోరారు.

ధోబీఘాట్ పనులు త్వరగా చేపట్టండి

మహబూబాబాద్: మండలంలోని కురవి రోడ్డులో తలపెట్టిన ధోబీఘాట్ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సదరు స్థలాన్ని అధికారులతో కలిసి గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఈ ఉపేందర్, గంగాధర్, మహేశ్ పాల్గొన్నారు.

నివాళి

కొత్తగూడ : స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గణేశ్ చిత్రపటానికి జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య గురువారం నివాళులర్పించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడారు. అమరుల ఆశయాలను సాధిస్తామన్నారు. పోడు పోరాటంలో గణేశ్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పుల్లన్న, శ్రీశైలం, యుగేందర్, నిర్మల పాల్గొన్నారు.

స్కూల్ లైబ్రరీకి పుస్తకాల వితరణ

డోర్నకల్ : మండలంలోని మన్నెగూడెం జెడ్పీ హైస్కూల్‌లోని గ్రంథాలయానికి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కొంపెల్లి రామయ్య అతడి స్నేహితుల సహకారంతో గురువారం రూ.5 వేలు విలువైన పుస్తకాలను బహూకరించారు. సదరు పుస్తకాలను ఆయన ఎంపీఓ పూల్‌చంద్, హెచ్‌ఎం విత్తనాల సుధాకర్ తదితరుల చేతుల మీదుగా అందించారు.

ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి

తొర్రూరు : ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగధారి సిద్దు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను అధికారులు పరీక్షించని పరిస్థితుల్లోనే పలు ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. రవాణా శాఖ అధికారులు అన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సమావేశంలో సంఘం నగర కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు మహేశ్, సాయి, మహేందర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చిన్నగూడూరు : మండలంలోని మన్నెగూడెంలో ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న 8 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణాకర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి తార, హెల్త్ సూపర్‌వైజర్ ధర్మేంద్ర, ఏఎన్ఎంలు శ్యామల, శ్రీవాణి, ఆశ వర్కర్లు పుష్ప, సంధ్య పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

మరిపెడ రూరల్ : మండలంలోని గాలివారిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం పంపించిన నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం భర్తపురం మురళీధర్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని తెలిపారు. ఉచితంగా మధ్యాహ్నం భోజనం, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుగులోతు వెంకన్న, షేక్ ఫైజుద్దీన్, గుగులోతు బాలు, లింగాల మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ కవిత పరామర్శ

కేసముద్రం : మండల కేంద్రానికి చెందిన లెంకలపల్లి వెంకటేశ్వర్లు, వెంకటగిరి శివారులోని చంద్రుతండాకు చెందిన బిల్యా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎంపీ మాలోతు కవిత గురువారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరావు పాల్గొన్నారు.

అనాథ బాలలను ప్రభుత్వం ఆదుకోవాలి



సాయం అందిస్తున్న బాలాజీ నాయక్

నెల్లికుదురు : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మాదరి వర్షిత్‌కుమార్, వర్షితలను ప్రభుత్వం ఆదుకోవాలని నెల్లికుదురు సొసైటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బాలాజీ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ పిల్లలను వారి ఇంటి వద్ద ఆయన గురువారం కలిసి పరామర్శించి రూ.10 వేలు సాయం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్షిత్ కుమార్, వర్షితల తల్లిదండ్రులిద్దరూ చనిపోవడం బాధాకరమన్నారు. ఇద్దరు బాలలనూ ప్రభుత్వం దత్తత తీసుకుని విద్య, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. పిల్లలకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. అశోక్, శ్రీనివాస్, భాస్కర్ నాయక్, మాదరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగినా నిర్లక్ష్యమే..

నెల్లికుదురు : గిరిజన తండాలో విద్యుత్ తీగ తెగిపడినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని రత్తిరాంతండా ఎంపీటీసీ, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మదన్ తెలిపారు. మండలంలోని నల్లగుట్టతండా శివారులోని భోజ్యాతండాలో తెగిపడిన విద్యుత్ తీగలతో ఓ గిరిజనుడి ఇంటిపై గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మదన్ మాట్లాడారు. బోజ్యాతండాలో సింగిల్ ఫేజ్ విద్యుత్ తీగ తెగిపడిందని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. 20 రోజులు గడచినా నిర్లక్ష్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు తెగిపడిన విద్యుత్ తీగను సరిచేసి రత్తిరాం తండా పరిధిలోని వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు వెంకన్న, రమేశ్, శ్రీనివాస్ తండావాసులు పాల్గొన్నారు.



విద్యుత్ తీగతో నిరసన తెలుపుతున్న స్థానికులు

రోడ్డు మరమ్మతుల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్



కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని లాలుతండాలో గురువారం రోడ్డు మరమ్మతులో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ భాగస్వాములయ్యారు. తట్టపట్టి ఇసుక, కంకర, మొరాన్ని రోడ్డుపైనున్న గుంతల్లో పోశారు. తొలుత ఇనుగుర్తిలో సీసీ రోడ్డు ప్రారంభించి ఊకల్లు వైపునకు వెళ్తున్న ఎమ్మెల్యేను లాలుతండా వద్ద తండావాసులు కలిసి వర్షాలకు రోడ్లు బురదమయమయ్యాయని, నడవలేని స్థితి నెలకొందని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఓ వ్యక్తి ఇంటిముందున్న కంకర, ఇసుకను వారి అనుమతితో వినియోగిస్తూ స్థానికులతో కలిసి పనులు చేపట్టారు. సీడీఎఫ్, ఎస్ఆర్ఈజీఎస్, సీఎం ఫండ్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించి సీసీ రోడ్డు వేయిస్తానని చెప్పారు. పోడుభూములకు హక్కుపత్రాలు రాలేదని తండావాసులు తెలుపగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.